# అసలేం జరుగుతోంది..



## మహా నగరంలో అదృశ్యమవుతున్న మహిళలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**మహా విశాఖ నగరంలో మహిళల అదృశ్యం కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. కొంత మంది మహిళలు అదృశ్యానికి వివాహేతర సంబంధాలు, కుటుంబ వివాదాలే కారణమైతే.. మరికొందరి అదృశ్యానికి కారణం మాత్రం కుటుంబ సభ్యులకు సైతం అంతుబట్టకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 175 మంది మహిళలు అదృశ్యం కాగా వీరిలో 42 మంది ఆచూకీ ఇప్పటివరకు లభ్యం కాకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.**

- నానాటికీ అధికమవుతున్న మిస్సింగ్ కేసులు
- గత నాలుగు నెలల్లో 175 కేసుల నమోదు
- వీటిలో 133 మంది ఆచూకీని కనిపెట్టిన పోలీసులు
- 42 మంది ఆచూకీ ఇప్పటివరకు లభ్యం కాని వైనం
- కొన్ని కేసుల్లో వివాహేతర సంబంధాలే కారణం
- మరికొందరి అదృశ్యాలు ఇప్పటికీ మిస్టరీయే..

**గత నాలుగునెలల్లో మహిళల మిస్సింగ్ కేసులు**

| నెల | ఫిర్యాదులు | గుర్తించినవి | ఆచూకీలేనివి | ఒకరోజులో గుర్తించినవి | కేసు నమోదుకు ముందే గుర్తించినవి |
|---|---|---|---|---|---|
| జనవరి | 37 | 31 | 6 | 10 | 2 |
| ఫిబ్రవరి | 49 | 40 | 9 | 13 | 3 |
| మార్చి | 43 | 33 | 10 | 10 | 1 |
| ఏప్రిల్ | 46 | 29 | 17 | 9 | 2 |
| మొత్తం | 175 | 133 | 42 | 42 | 8 |

● 'జిల్లాలోని పద్మనాభం ప్రాంతానికి చెందిన 28 ఏళ్ల వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఈ నెల 2న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఇంతవరకూ ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆమె ఆచూకీ గాలిస్తున్నారు.'

● 'పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ వివాహిత కొన్నాళ్ల కిందట పుట్టింటికి వెళ్లాస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి చేరలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం ఎంతగా గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి చివరకు ఆమె ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు.'

● 'మారికవలస వాంబే కాలనీలో నివాసం ఉంటున్న ఓ వివాహిత ఫంక్షన్‌కు వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించగా, రెండు రోజుల తర్వాత ఆమె మృతదేహం దాకమర్రి వద్ద ఒక లేఅవుట్‌లో సగం కాలిపోయిన స్థితిలో లభ్యమైంది.'

...ఇలా నగరంలో మహిళలు అదృశ్యం కేసులు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పాటు వివాహేతర సంబంధాలే దీనికి ప్రధాన కారణంగా పోలీసులు చెబుతున్నారు. అదృశ్యమైపోతున్న వారిలో పెళ్లి కావాల్సిన యువతులతోపాటు వివాహమై పిల్లలు ఉన్నవారు సైతం ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వివాహేతర సంబంధం కారణంగా కొందరు ఇంట్లోవారికి చెప్పకుండా ఇతరులతో వెళ్లిపోయి రహస్యంగా జీవనం సాగిస్తున్నారు. మరికొందరు మాత్రం మానసిక రుగ్మతలు, కుటుంబ వివాదాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా

... మిగతా 6వ పేజీలో

# ఆర్టీసీకి సమ్మర్ కిక్



- 20 శాతం పెరిగిన ప్రయాణికులు
- పెరిగిన ఓఆర్, ఆదాయం
- రోజుకు సుమారు రూ.99 లక్షల ఆదాయం వస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్న అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు వేసవి కాలం కలిసొచ్చింది. ప్రయాణికుల తాకిడి అధికం కావడంతో అందుకు అనుగుణంగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెరిగింది. ఈ రెండింటి ప్రభావంతో ఆదాయం కూడా పెరిగింది. ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి ఇదే పరిస్థితి కొనసాగింది. దీంతో ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు మంచిరోజులు వచ్చాయని అధికారులు, సిబ్బంది సంబరపడుతున్నారు. విశాఖ రీజియన్ పరిధిలోని మధురవాడ, మద్దిలపాలెం, విశాఖపట్నం, వాల్తేరు, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోల్లో 814 బస్సులు ఉన్నాయి. ఇవి రోజుకు సుమారు రెండున్నర లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ 5.44 లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి చేరుస్తున్నాయి.

### పెరిగిన ప్రయాణికులు

ఈ ఏడాది సమ్మర్‌లో ఆర్టీసీకి ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రోజుకు 5.44 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు. ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి రోజువారీ ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ ఏప్రిల్ నెలాఖరు నాటికి ఆ సంఖ్య 6.8 లక్షలకు చేరుకుంది. ఇప్పటివరకు అదే సంఖ్య స్థిరంగా కొనసాగుతోంది. ఇది సాధారణ రోజుల ప్రయాణికుల సంఖ్య కంటే 20 శాతం ఎక్కువ. ఇంతకు మునుపెన్నడూ ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదల లేదని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు చెబుతున్నారు. వివాహాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు ఎక్కువగా జరుగుతుండడం, విద్యా సంస్థలకు సెలవులు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞాన విహార యాత్రలకు రాకపోకలు సాగిస్తుండడం, ఇంకొందరు పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలకు వెళ్లి వస్తుండడంతో ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతుండడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

### పెరిగిన ఓఆర్, ఆదాయం

విశాఖ రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్య

... మిగతా 6వ పేజీలో

# భూముల అప్పగింతకు ఎందుకంత అత్యుత్సాహం!

- ఓ ఉన్నతాధికారి తీరుపై రెవెన్యూ వర్గాల విస్మయం
- గతంలో తప్పులు చేసిన పలువురు అధికారులపై చర్యలేవీ?
- రెండు సిట్‌ల నివేదికలను బయటపెడితే అక్రమార్కులైన అధికారులెవరో వెల్లడి
- ఎండాడలో మాజీ సైనికుడికి భూమి అప్పగింతలో కీలకంగా వ్యవహరించిన కూటమి నేత


ఎండాడలో మాజీ సైనికాధికారికి కట్టబెట్టిన భూములు

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు అప్పగింతలో ఓ ఉన్నతాధికారి అత్యుత్సాహంపై రెవెన్యూ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతుంది. ప్రభుత్వ భూముల రక్షణ కోసం వాటిని నిషేధిత జాబితాలో జిల్లా అధికారులు చేర్చిన విషయం తెలిసి కూడా తానేమి చేసినా చెల్లుతుందన్న ధీమాతో వ్యవహరించారని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒకటి, రెండు కాదు... ఏకంగా 10 నుంచి 12 సర్వే నంబర్లకు చెందిన 60 నుంచి 70 ఎకరాల భూములను ధారాదత్తం చేయడానికి సాహసం చేయడమేంటనే వాదన వినిపిస్తోంది. పొరపాటున 22-ఏ జాబితాలో చేరిన ప్రైవేటు భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి ప్రయత్నిస్తే ఎవరూ ఏమీ చేయలేరు. అటువంటిది చెరువులు, నీరు ప్రవహించే ప్రాంతాలు, అటవీశాఖకు చెందిన భూములను ఎలా 22-ఏ నుంచి తప్పించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశిస్తారని రిటైర్డు తహశీల్దార్ ఒకరు ప్రశ్నిస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాగా పేర్కొన్న భూముల్లో కొన్ని అటవీశాఖకు చెందినవి. అటవీశాఖ భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకూడదు. ముడసర్లోవలో సర్వే నంబరు 31/2లో ఉన్న భూములను 22-ఏ నుంచి తప్పించాలని ఆదేశించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకరి అర్జీని ఆమోదిస్తే ముడసర్లోవ పరీవాహక ప్రాంతంలో చాలా భూములు పరాధీనమవుతాయనే విషయం ఆ ఉన్నతాధికారికి తెలియదా? అన్న సందేహం వ్యక్తమవుతుంది.

జిల్లాలో తహశీల్దార్, ఆపై అధికారులు కొందరు పలు తప్పులు చేయడంతో అనేక సర్వే నంబర్లపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కొందరు అధికారుల నిర్వాకంతో జిల్లాలో కోట్ల రూపాయల విలువైన భూములు పరాధీనమయ్యాయి. దళారులతో కుమ్మక్కైన అధికారులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో మరికొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మధురవాడలో సర్వే నంబర్లు 367, 368, 369లో భూములు ప్రైవేటు వ్యక్తులకు కేటాయించే వ్యవహారంలో ఏడుగురు డిప్యూటీ కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా వారిపై విచారణకు అధికారులు ఇంకా తాత్సారం చేస్తున్నారు. భూముల అక్రమాలపై గతంలో టీడీపీ, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వేర్వేరుగా సిట్‌లు వేశారు. రెండు సిట్‌ల నివేదికలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి. నగర పరిసరాల్లో అనేక భూముల పరాధీనం కావడానికి పలువురు అధికారుల పాత్ర ఉన్నట్టు రెండు సిట్‌లు నిర్ధారించాయి. ఈ రెండు సిట్‌ల నివేదికలను

... మిగతా 6వ పేజీలో

## స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో

**ఉద్యోగం వచ్చేలా చేస్తామంటూ మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు ఫోన్లు**

# దళారుల దందా!

- అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అప్రమత్తమైన యంత్రాంగం
- మోసగాళ్ల మాటలను నమ్మవద్దని ఆర్డీ సూచన
- ఇప్పటికే కరోనా సమయంలో పనిచేసినట్టు నకిలీ కొవిడ్ సర్టిఫికెట్ల గుర్తింపు
- నకిలీ మార్కుల లిస్టును జత చేసిన పలువురు అభ్యర్థులు
- జన్యూనిటీ పరిశీలనకు విజయవాడ పంపిన అధికారులు
- నియామక ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ ప్రక్రియలో దళారులు రంగప్రవేశం చేశారు. ఇప్పటికే విడుదల చేసిన మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు ఫోన్లు చేసి కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. తాము ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని, స్టాఫ్ నర్సు ఉద్యోగానికి ఎంపికయ్యే అభ్యర్థుల జాబితాలో మీరున్నారంటూ కొందరు అభ్యర్థులకు ఫోన్లు వస్తున్నాయి. ఉద్యోగం రావాలంటే కొంత డబ్బు చెల్లించాలంటూ వారిని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన పలువురు అభ్యర్థులు కార్యాలయ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో ఈ వ్యవహారంపై అధికారులు ఆరా తీస్తున్నారు. కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి తీరుపై ఆరోపణలు వస్తుండడంతో మరింత సీరియస్‌గా ఆర్డీ రాధారాణి ఈ వ్యవహారాన్ని తీసుకున్నట్టు పలువురు చెబుతున్నారు. దీనిపై ఆమె ఇప్పటికే ఒక ప్రకటనను కూడా విడుదల చేశారు. ఈ తరహా ఫోన్ కాల్స్‌ను ఎవరూ నమ్మవద్దని, అత్యంత పారదర్శకంగా పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. దళారుల నుంచి ఫోన్లు వస్తే వెంటనే అభ్యర్థులు తమ దృష్టికి తీసుకురావడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాధారాణి సూచించారు.

### భారీగా నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపు

ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న 370 పోస్టులను భర్తీ చేసేందుకు కొన్నాళ్ల కిందట నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా పోస్టులకు సుమారు 8,300 మంది అభ్యర్థులు దరఖాస్తు


జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

చేసుకున్నారు. వాటిని అధికారులు పకడ్బందీగా పరిశీలించారు. గతంలోనూ పలువురు నకిలీ సర్టిఫికెట్లు పెట్టినట్టు ఆర్డీ దృష్టికి రావడంతో సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలను జారీ చేశారు. నకిలీ సర్టిఫికెట్‌తో కూడిన దరఖాస్తులేవీ పరిశీలనలోకి రాకూడదని ఆమె స్పష్టం చేశారు. దీంతో దరఖాస్తుల వడపోత ప్రక్రియ ఎంతో పకడ్బందీగా నిర్వహించడంతో వివిధ రకాల నకిలీ సర్టిఫికెట్లను పెట్టిన అభ్యర్థులను గుర్తించారు. వీరిలో 14 మంది కరోనా సమయంలో పని చేయకుండానే పనిచేసినట్టు నకిలీ కొవిడ్ సర్టిఫికెట్లను జత చేసినట్టు గుర్తించారు. మరో 15 మంది అభ్యర్థులు నకిలీ మార్కుల లిస్టులను జత చేసినట్టు తేల్చారు. వీటి జన్యూనిటీని నిర్ధారించేందుకు విజయవాడకు పంపినట్టు అధికారులు చెబుతున్నారు. అక్కడనుంచి వీటిపై స్పష్టత వచ్చాక సదరు అభ్యర్థులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

### ఇదే తంతు..

ఆరోగ్యశాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన ప్రతిసారి ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలు జరుగుతుండడం గమనార్హం. ఫేక్ సర్టిఫికెట్లు పెట్టడం, దళారులు రంగప్రవేశం చేయడం, కొందరికి నకిలీ నియామక పత్రాలు అందించడం పరిపాటిగా మారుతోంది. ఈ తరహా వ్యవహారాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే నిరంతరం ఇదే పనిలో కొందరు ఉంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు ఈ తరహా చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఈ తరహా పరిస్థితులు ఉత్పన్నం కావని చెబుతున్నారు. మరి ఆరోగ్యశాఖ అధికారులు కఠినంగా వ్యవహరించడంలో ఉదాసీన వైఖరిని ఎందుకు ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీంతో నియామక ప్రక్రియలో జాప్యం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- మొత్తం విద్యార్థులు 39,992 మంది.. 81 కేంద్రాలు
- నిమిషం ఆలస్యంగా వచ్చినా నో ఎంట్రీ..
- ఆర్ఐవో మురళీధర్

మద్దిలపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20 వరకు జరగనున్న పరీక్షలకు గాను ప్రథమ సంవత్సరానికి 66 కేంద్రాలు, ద్వితీయ సంవత్సర విద్యార్థుల కోసం 15 కలిపి మొత్తం 81 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 32,780 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 7,212 మంది విద్యార్థులు కలిపి మొత్తం 39,992 మంది హాజరు కానున్నారు. కాగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్-0891-2567561ను సంప్రదించవచ్చు.

### నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతించేది లేదని ఆర్ఐవో బి.మురళీధర్ స్పష్టం చేశారు. అందువల్ల విద్యార్థులందరూ అరగంట ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షలు జరిగే గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, కస్టోడియన్స్‌తో సిటింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్టు ఆర్ఐవో తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆదివారం సాయంత్రం ఆర్కేబీచ్‌లో సేదతీరుతున్న జనం

# ఉక్కిరిబిక్కిరి

**భగభగలాడిన భానుడు**

- ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన నగరవాసులు



విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. గడిచిన కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత అధికం కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆదివారం ఉదయం ఎనిమిది నుంచే ఎండ తీవ్రత అధికం కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత నుంచి ఎండ తీవ్రత మరింత తీవ్రం కావడంతో పాటు తీవ్రమైన ఉక్కపోత వేధించింది. దీంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు భీతిల్లిపోయారు. అత్యవసరమైతే తప్పా చాలామంది బయటకు వెళ్లలేదు. బయట పని చేసేవాళ్లు, ప్రయాణాలు చేసిన వాళ్లు ఎండ వేడిమికి విలవిల్లాడిపోయారు. కాగా ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు నగరవాసులు బీచ్‌కు చేరడంతో తీర ప్రాంతాలు కిటకిటలాడాయి. నగర పరిధిలోని అనేక ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులతో ఆర్కే బీచ్‌తో పాటు రుషికొండ బీచ్ కిటకిటలాడాయి. చాలామంది ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు సముద్రంలో స్నానాలు చేస్తూ కనిపించారు.



అమ్మకానికి సిద్ధం చేసిన ప్యాకెట్లు

## రేపటి నుంచి ఒలుపు చందనం ప్యాకెట్ల విక్రయం

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఒలుపు చందనం ప్యాకెట్ల విక్రయం మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్టు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చందనోత్సవం పురస్కరించుకుని గతనెల 29న రాత్రి ఆలయ వైదికులు స్వామివారిపై ఏడాది పొడవునా ఉన్న చందనాన్ని ఒలిచి వేరుచేశారు. అధికారులు రెండు రోజులుగా ఒలుపు చందనాన్ని 10 గ్రాములు బరువు గల ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయానికి సిద్ధం చేశారు. వీటిని సింహగిరిపై రూ. 10 చొప్పున విక్రయించనున్నారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో 400 ప్యాకెట్లు, రూ.100, రూ.300 దర్శనం టికెట్ల క్యూలైన్లలో 300 చొప్పున ప్యాకెట్లు విక్రయించనున్నట్టు ఏఈఓ చెప్పారు. అలాగే ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద ప్రత్యేక కౌంటర్‌లో కూడా విక్రయిస్తామన్నారు. స్టాకు ఉన్నంతవరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు విక్రయాలు ప్రారంభిస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## వివాహ వేడుకలో కొట్లాట

భీమునిపట్నం (రూరల్), మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ పంచాయతీ ఆశిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి వివాహ వేడుకలో కొట్లాట జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బి. తిరుమలరావు తెలిపారు. పెళ్లి కుమారుడు వర్గానికి చెందిన నల్లా తాతారావు పెళ్లి కుమార్తె ఇంటి వద్దకు వెళ్లి గొడవ పడ్డాడు. వారు తాతారావును కర్రతో కొట్టడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈమేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. కాగా పాత కక్షల నేపథ్యంలో కొట్లాట జరిగినట్టు తెలిసింది.

## అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన నటరాజ నాట్య కళామండలి కళాకారులు ఆదివారం పలు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. మహా గణపతి ప్రార్థనతో మొదలైన నృత్యాలు తారంగం, మూషిక వాహన, రామాయణ శబ్దం, చక్కని తల్లికి వందనాలు, ఛాంగు భళ, అదిఓ అల్లదిఓ, శివ తాండవం తదితర కీర్తనలకు వాసుదేవ, స్వాతి, స్నేహ, ఇందు, కీర్తి, సింధూజ, శ్రియ, హేమప్రియ, లలితాంబ, అనూష, తదితరులు నృత్యరీతులు సమకూర్చారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

విశాలాక్షినగర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర అన్నారు. ఆదివారం 9వ వార్డు పరిధిలోని రామాలయం వీధిలో టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు, వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో ప్రతాప్ రుద్ర జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామాలయం వీధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు దబ్బి వెంకట్రావు, సబ్బి శివ, వెంకన్న, మద్ది రాజు, అప్పలరెడ్డి, ఉషా, సత్య, మంగలీల, ప్రభ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎంఎస్‌ఎంఈ పరీక్ష

విశాఖపట్నం,మే 11 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ ఎంఎస్ ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ ఎంఈ) సెట్-2025 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 520 మంది విద్యార్థులు హాజరైనట్టు ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ . విజయ్ మోహన్ తెలిపారు. ఏయూలో ఒక కేంద్రం ఏర్పాటు చేయగా, అచ్యుతాపురంలోని ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో మరో కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 600 మంది దరఖాస్తు చేసుకోగా, ఏయూలోని కేంద్రానికి 178 మంది, అచ్యుతాపురంలోని కేంద్రానికి 342 మంది హాజరయ్యారు.



జట్లమ్మ ఆలయం (ఇన్‌సెట్లో) అమ్మవారు



సిరిమాను, రథం తయారీ పనుల్లో నిమగ్నమైన గ్రామస్తులు

# నేటి నుంచి పాండ్రంగిలో జట్లమ్మ పండగ

- మూడు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

పద్మనాభం, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామంలో జట్లమ్మ సిరిమాను పండగ సోమవారం నుంచి జరగనుంది. ఈమేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏరాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రధాన రథాలను, సిరిమాను తయారీ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆలయం వద్ద చలువ పందిర్లు వేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామంలోకి ప్రవేశించే రోడ్డుకు మరమ్మతులు జరిపారు. ఉత్సవంలో భాగంగా ఈనెల 3న ఉబిడి చాటింపు, 4న ఉబిడి అమ్మవారి అనుపోత్సవం, అదే రోజు జట్లమ్మ అమ్మవారి పండగ చాటింపు నిర్వహించారు. 5న దేవర సంబరం నిర్వహించి, అమ్మవారిని గ్రామంలోకి తోడ్కోని వచ్చారు. అప్పటి నుంచి ప్రతిరోజూ ఘటాలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఘటాల ఊరేగింపు, సతకం పట్టు వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మంగళవారం సిరిమాను సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వెన్నివారి కుటుంబానికి చెందిన అంజలి రథంతో పాటు బూర్లె,మైలపల్లి కుటుంబాలకు చెందిన ప్రధాన రథాలు కూడా సిరిమానుతో పాటు సతకం పట్టు నుంచి ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఏడాది సిరిమానును పాండ్రంగి నాగరాజు అధిరోహిస్తారు. బూర్లె గురునాయుడు, ఫకీరు పూజారులుగా ఉత్సవం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా కోలాటం, పులివేషాలు, కత్తి సాము, కర్ర సాము తదితర పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సిరిమాను సంబరాన్ని నిర్వహిస్తారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు ఉత్సవంలో పాల్గొనున్నారు. 14న కనుమతో పండగ ముగుస్తుంది.

## 'సమ్మెను విజయవంతం చేయండి'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కొమ్మాది, మే 11 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం మధురవాడ జోన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మె పోస్టర్‌ను కొమ్మాది కూడలిలో ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, పేడాడ రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి నాయకులు అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ విధానాల వల్ల పనులు లేక కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను ఇష్టారాజ్యంగా వాడుకుని కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ బోర్డు నుంచి తీసుకున్న నిధులను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే 20న జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో త్రిశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎల్. దుర్గారావు, నాయకులు తిరుపతి, సత్తిబాబు, రామన్న డి. అప్పలరాజు పాల్గొన్నారు.

## కేంద్ర హిందీ సలహా సంఘం సభ్యుడిగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హిందీ సలహా సంఘం సభ్యుడిగా పద్మభూషణ్, ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సంఘం కేంద్ర మంత్రిత్వ శాఖల హిందీ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తూ, భాషాపరంగా సమతుల్యతకు దోహదపడేలా పనిచేస్తుంది. ఈసంఘానికి దక్షిణ భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి లక్ష్మీప్రసాద్ కావడం గమనార్హం.సంఘంలో మొత్తంగా 17 మంది సభ్యులు ఉంటారు. ఈ నియామకం మూడేళ్ల కాలానికి వర్తిస్తుంది.

## అభివృద్ధి పనులు పరిశీలన

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని సింహపురి కాలనీ, అప్పన్నపాలెం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులును వార్డు కార్పొరేటర్ పివి నరసింహం ఆదివారరం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపం తలెత్తకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మామిడి దుర్గాప్రసాద్, కాలనీ అధ్యక్షుడు సురేంద్రబాబు ఉన్నారు.

## ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవం

భీమునిపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రొంపిచర్ల సింగరాచార్యులు స్వామివారికి 32 కలశాలతో అభిషేకాలు జరిపి, అనంతరం కలసారాధన, నవగ్రహ మండపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న గొంప చంద్రమౌళి

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అసోసియేషన్‌లోని 395 మంది సభ్యుల్లో 310 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా వీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం. సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దాల రమేశ్, ఉపాధ్యక్షులుగా గుర్రం సింహాచలం, బర్ల రామానాయుడు, ట్రెజరర్‌గా సిరికి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్‌గా మధుపాడ రవికుమార్, జాయింట్ కార్యదర్శులుగా బూటు కృష్ణ, కె. అప్పలనాయుడు. సభ్యులుగా కోటేశ్వరరావు, కంచర్ల శ్రీను, కె. రామలింగేశ్వరరావు, అల్లు సూర్యనారాయణ, అల్లు బంగారునాయుడు, నేమాల రమేశ్, చిట్టి గణపతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ కాంట్రాక్టర్లు కేజీ రామారావు, ఏఆర్ అప్పలరాజు, పి.సుబ్బారావు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని తాజా మాజీ సంఘం అధ్యక్షుడు గొంప చంద్రమౌళి అభినందించారు.

## సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం యాగశాలార్చనలు, విశేషార్చనలు జరిగాయి. అనంతరం మహిళలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ తులాభారం, కోలాటోత్సవం, నగరంలోని సుజాతానగర్ బాల సరస్వతి నాట్య మండలి వారితో భరత నాట్య ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, శ్రీరామచంద్రమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, ఆలయ సంఘం కోశాధికారి పుశిరికల బంగార్రాజు, ఆలయ ప్రధానార్చకుడు పురాణం శేషాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక నేత గంగాధరరెడ్డికి నివాళి

తగరపువలస, మే 11 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లులో కార్మిక సంఘం నాయకుడిగా పని చేసి కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చిన ఎస్. గంగాధరరెడ్డి 8వ వర్ధంతి సభను చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు జీరు కైలాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కార్మికుల సంక్షేమానికి గంగాధరరెడ్డి చేసిన కృషిని కొనియాడారు. అంతకముందు పలువురు గంగాధర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, ఎం. ఆదినారాయణ, జి. అప్పారావు, ఎస్. శంకర్‌రెడ్డి, వరహాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ స్ఫూర్తితో సేవలు

భీమునిపట్నం (రూరల్), మే 11 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నాగ సందీప్ అన్నారు. ఆదివారం ఆయన నగరపాలెంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు జనసేన తరపున అన్ని గ్రామాల్లోనూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ కె. రామస్వామినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ఎన్. శ్రీధర్, బూత్ కమిటీల ఇన్‌చార్జి ఎస్ శ్రీనుబాబు, నాయకులు కె.సురేశ్, జి పాపారావు, కె. శ్రీను, ఇద్దిపల్లి నానాజీ, గురునాయుడు పాల్గొన్నారు.

## నగరంలో వాహనాల తనిఖీ

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాలు మేరకు పోలీసులు ఆదివారం రాత్రి నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో నాకాబంధీ, వాహనాల తనిఖీ నిర్వహించారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్, లాడ్జిలతో పాటు 32 కూడళ్లలో సాయంత్రం ఆరు నుంచి ఈ తనిఖీలు చేపట్టారు. 1212 వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు లేని తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు, అలాగే హెల్మెట్ ధరించని 50 మందిపై, మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిపై, నంబర్ ప్లేట్ సరిగ్గా లేని ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు



ఎండాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ప్రమాదం జరిగింది. నగరం నుంచి మధురవాడకు వెళ్తున్న కారుకు బైక్ అడ్డంగా రావడంతో కారు అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## భక్తులకు మెరుగైన సేవలు

### - సింహాచలం నూతన ఈఓ సుజాత



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఓ సుజాత

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సేవలందిస్తామని ఆలయ నూతన ఈఓ, దేవదాయ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్. సుజాత అన్నారు. ఆదివారం ఉదయం ఆమె సింహాచలం దేవస్థానం ఈఓగా బాధ్యతలు చేపట్టారు. తొలుత స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.అనంతరం ఆలయ ఆవరణలో చార్జి టేకింగ్ ఓవర్ బుక్‌లో తొలి సంతకం చేశారు. సాయంత్రం వరకు కొండదిగువ తన కార్యాలయంలో పలు ఫైళ్లు పరిశీలిస్తూ బిజీగా గడిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు దేవస్థానం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## రెండో విడత చందనం సమర్పణకు ఏర్పాట్లు పూర్తి



చందనం ముద్దలో చూర్ణాలను మిళితం చేస్తున్న వైదికులు

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని పైపూతగా రెండో విడత చందనం సమర్పణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 7 నుంచి ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది మూడు రోజుల్లో మూడు మణుగు (125 కిలో) ల సిరి చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ సారథ్యంలో ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచర్యులు ముందుగా సిద్ధం చేసిన 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాన్ని ఆదివారం మిళితం చేశారు. దీన్ని సోమవారం వేకువజామున సుప్రభాతసేవ తరువాత పండితుల మంత్రోచ్చారణలు నడుమ స్వామివారికి సమర్పించనున్నారు.

## 'రక్తదానానికి యువత ముందుకు రావాలి'



రక్తదానం చేస్తున్న దాతలు

సాగర్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని సాయిప్రియా రిసార్ట్స్ ఎండీ డీఆర్‌కే ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం రుషికొండలో ఉన్న సాయిప్రియా రిసార్ట్స్ ఆవరణలో పండిట్ రవి శంకర్ గురుజీ జన్మదినం, ప్రపంచ తలసేమియా దినోత్సవం పురస్కరించుకుని రామ్‌నగర్ లయన్స్ బ్లడ్ బ్యాంక్, ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గుర్ని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి ఆల పాటి శ్రీనివాసరావు, లయన్స్ బ్లడ్ సెంటర్ మేనేజింగ్ ట్రస్టీ ఎన్. సుధాకరరావు, హర్ష, కర్లపాటి వాణి, సాయి ప్రియా రిసార్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి అండర్-11 బాలుర బాలికల ఓపెన్ చెస్ టోర్నీ కమ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. గాజువాడ లయన్స్ క్లబ్‌లో జరిగిన ఈ ఎంపిక టోర్నీలో బాలుర బాలికల విభాగాల నుంచి 137 మంది చిన్నారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. బాలుర విభాగంలో అవసరాల సౌరాజేష్, శశాంక కుంచ....బాలికల విభాగంలో అఫ్షిన్ మహ్మద్, కమల ప్రియ బట్ట ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచారు. తొలి రెండు స్థానాలలో విజేతలుగా నిలిచిన చిన్నారులు త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు.

# అసలేం జరుగుతోంది..

... 5వ పేజీ తరువాయి

ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరడం లేదు. కొన్ని కేసుల్లో మాత్రం భారీగా ఆదాయం వచ్చే ఉద్యోగం, పని చూపిస్తామంటూ అమాయకులైన మహిళలను మభ్యపెట్టి కొందరు తీసుకువెళ్లి ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్న పరిస్థితి కనిపిస్తుండడం శోచనీయం. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాలుగు నెలల్లో మహిళల అదృశ్యానికి సంబంధించి 175 ఫిర్యాదులు అందగా, వీటిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగిలిన 42 మంది ఆచూకీ మాత్రం ఇంతవరకు లభ్యం కాకపోవడంతో వారంతా ఏమైపోయారనే దానిపై వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జనవరి నెలలో 37 మంది , ఫిబ్రవరిలో 49 మంది, మార్చిలో 43 మంది, ఏప్రి ల్‌లో 46 మంది మహిళలు కనిపించడం లేదంటూ వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుల్లో పోలీసులకు ఫిర్యాదులు అందిన వాటిలో 42 మందిని ఒక రోజు వ్యవధిలోనే ఎక్కడ ఉన్నారో గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం పోలీసులు మిస్సింగ్ కేసుల దర్యాప్తులో చూపుతున్న శ్రద్ధకు అద్దంపడుతోందనే చెప్పవచ్చు. మరో ఎనిమిది కేసులను మాత్రం కేసు నమోదు చేయడానికి ముందే పోలీసులు వారి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో అదృశ్యమై ఇప్పటికీ ఆచూకీ దొరకని మహిళల పరిస్థితి నెలకొన డంతో అసలేం జరుగుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వారు ఎక్కడైనా జీవించి ఉన్నారా? లేక మృతి చెందారా? అని కుటుంబ సభ్యులు మానసిక వేదనకు గురవుతున్నారు. మహిళలు, యువతుల మిస్సింగ్ కేసులపై పోలీసులు మరింత శ్రద్ధ చూపిస్తే బాధిత కుటుంబాలకు స్వాంతన కలిగించేందుకు అవకాశం కలుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## భూముల అప్పగింతకు ఎందుకంత అత్యుత్సాహం!

... 5వ పేజీ తరువాయి

బహిర్గతం చేస్తే అక్రమార్కులైన అధికారుల ఎవరో వెల్లడవుతుంది. తద్వారా వారిపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో పక్కాగా ఉంటారని రెవెన్యూ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఇదిలావుండగా విశాఖ రూరల్ మండలం ఎండాడలో సర్వే నంబర్ 14-1లో 5.10 ఎకరాల భూమి మాజీ సైనికాధికారికి కట్టబెట్టడంలో గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఇద్దరు నేతలు కూటమి ప్రభుత్వంలోనూ పైరవీలు చేశారనే ఆరోపణలున్నాయి. వీరిలో ఒకరు ప్రస్తుతం కూటమి పార్టీలో కొనసాగుతుండడంతో తనకున్న పరిచయాలతో పైరవీలు చేశారనే విమర్శలున్నాయి. పార్టీ మారినా గతంలో ఉన్న పరిచయాలను కొనసాగించి భూముల ధారాదత్తంలో కీలక పాత్ర వహించడంపై కూటమి పార్టీలో కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్టీసీకి సమ్మర్ కిక్

... 5వ పేజీ తరువాయి

పెరిగిన కారణంగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. మొత్తం 814 బస్సులో 5.44 లక్షల మంది ప్రయాణించినప్పుడు సగటు ఆక్యుపెన్సీ రేషియో 57 శాతంగా ఉంది. ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి ఇవే బస్సుల్లో 6.8 లక్షల మంది ప్రయాణించడంతో సగటు ఆక్యుపెన్సీ రేషియో 67 శాతానికి పెరిగింది. ప్రస్తుతం ఇదే ఓఆర్ కొనసాగుతున్నది. రోజువారీ ఆదాయం కూడా అదే స్థాయిలో పెరిగింది. మార్చి నెలాఖరు వరకు సగటున రోజువారీ ఆదాయం రూ.88 లక్షలు ఉంది. అయితే ఏప్రిల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సగటున రోజువారీ ఆదాయం రూ.99 లక్షలు వస్తుందని అధికారులు పేర్కొన్నారు.







సందర్శకులతో కిటకిటలాడుతున్న భీమిలి, రుషికొండ తీర ప్రాంతాలు

## సందర్శకులతో భీమిలి, రుషికొండ బీచ్‌లు కిటకిట

సాగర్‌నగర్/భీమునిపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. మూ డు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న ప్రజలు సాయంత్రం బీచ్‌కు వచ్చి సేదతీరారు. నగరం నలుమూలలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా పర్యాట కులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బీచ్‌లు కిటకిటలాడాయి. సందర్శకుల్లో కొందరు సముద్ర స్నానాలు చేయగా మరికొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ గడిపారు. భీమిలి బీచ్‌కు కూడా సందర్శకులు తరలివచ్చారు. వాతావరణం వేడిగా ఉండడం, ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సాయంత్రం కాగానే చల్లని గాలులను ఆస్వాదించడానికి సాగర సంగమ తీరం వైపు తరలివచ్చారు. వాహనాల రద్దీతో బీచ్ రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

నిర్మానుష్యం



మధ్యాహ్నం 12 గంటల సమయంలో జన సంచారం లేని మెయిన్ రోడ్డు

భీమునిపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత రోజురోజుకి పెరుగుతోంది. ఉదయం 6 గంటల నుంచే భానుడు చుర్రుమంటున్నాడు. 10 గంటల తరువాత ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఎండల ధాటికి తట్టుకోలేక వ్యాపారులు మధ్యాహ్నం 1 గంట తరువాత దుకాణాలు మూసివేసి సాయంత్రం నాలుగున్నర గంటలకు తెరుస్తున్నారు. దీంతో నిత్యం రద్దీగా వుండే రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

## రేపటి నుంచి ఒలుపు చందనం ప్యాకెట్ల విక్రయం

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఒలుపు చందనం ప్యాకెట్ల విక్రయం మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్టు దేవాలయ ఏఈఓ ఎన్. ఆనంద కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చందనోత్సవం పురస్కరించుకుని గత నెల 29న రాత్రి ఆలయ వైదికులు స్వామివారిపై ఏడాది పొడవునా ఉన్న చందనాన్ని ఒలిచి వేరుచేశారు. రెండు రోజులుగా అధికారులు ఒలుపు చందనాన్ని పది గ్రాములు బరువు గల ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయానికి సిద్ధం చేశారు. వీటిని మంగళవారం నుంచి సింహగిరిపై రూ. 10 చొప్పున విక్రయించనున్నారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో 400 ప్యాకెట్లు, రూ.100, రూ.300 దర్శనం టికెట్ల క్యూలైన్లలో 300 చొప్పున ప్యాకెట్లు విక్రయించనున్నట్టు ఏఈఓ చెప్పారు. అలాగే ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద ప్రత్యేక కౌంటర్‌లో కూడా విక్రయిస్తామన్నారు. స్టాకు ఉన్నంతవరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు విక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు.

## కేంద్ర హిందీ సలహా సంఘ సభ్యుడిగా యార్లగడ్డ

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హిందీ సలహా సంఘం సభ్యు డిగా పద్మభూషణ్ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సంఘం కేంద్ర మంత్రిత్వ శాఖల హిందీ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తూ, భాషాపరంగా సమతుల్యతకు దోహదపడేలా పని చేస్తుంది. ఈ సంఘానికి దక్షిణ భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కావడం గమనార్హం. ఈ సంఘంలో మొత్తంగా 17 మంది సభ్యులు ఉంటారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హిందీ భాషా అభివృద్ధికి, హిందీలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించే సాహితీవేత్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈమేరకు ఆయన్ను సలహా సంఘం సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ నియామకం మూడేళ్ల కాలానికి వర్తిస్తుంది.

## ప్రశాంతంగా ఎంఎస్ఎంఈ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విజయ్‌మోహన్, ఇతర అధికారులు

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ ఎంఈ) సెట్-2025 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 520 మంది విద్యార్థులు హాజరైనట్టు ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ . విజయ్‌మోహన్ తెలిపారు. ఏయూలో ఒక కేంద్రం ఏర్పాటు చేయగా, అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో మరో కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 600 మంది దరఖాస్తు చేసుకోగా, ఏయూలోని కేంద్రానికి 178 మంది, అచ్యుతాపురంలోని కేంద్రానికి 342 మంది హాజరయ్యారు. ఎంఎస్ ఎంఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వి. సిద్ధయ్య, ఎంఎస్ ఎంఈ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.ప్రసాదరెడ్డి ఏయూలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

## సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 26, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 90, బద్ధచిక్కుడు 48, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాల కూర 3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 26, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80

**కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)**

| | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

# పెందుర్తిలో పోలీసుల కార్డెన్ సెర్చ్



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): నేరాలు నియంత్రించేందుకు పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీఐ కెవీ సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసుల కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా చినముషిడివాడ, పెందుర్తిలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని ఆటో, ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే భారత్ సిందూర్ ఆపరేషన్ చేపట్టిన నేపథ్యంలో పెందుర్తిలో నాకా బందీ నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో నాకాబందీ చేపట్టారు. అనుమానిత, సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ యుద్ధం నేపథ్యంలో నగర పరిధిలోని సింహాచలం, పెందుర్తి రైల్వేస్టేషన్లలో నాకాబందీ నిర్వహిస్తున్నామన్నారు, అనుమానితుల సంచారంపై నిఘా పెట్టామన్నారు.

## పెంటమాంబ అమ్మవారి పండగ చాటింపు

మల్కాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి 43వ పండగ చాటింపు ఆదివారం సాయంత్రం ఘనంగా చేపట్టారు. ఈ నెల 15న అమ్మవారి పండగ ప్రారంభమై 19 వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లుచేశారు. పండగ చాటింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు, అధ్యక్షుడు గండేపల్లి షణ్ముఖ, గురునాథరావు, రంగుభక్త అప్పలరాజు, సాలలాపు రవి, సీహెచ్ ఈశ్వరరావు, జామి లోకేష్, అవసపుసాయి, ఎదురు శ్రీనివాసరావు, ఎం.మంగతాయారు. ఎం.నూకరత్నం, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్ ఆవరణలో కళాజాత కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గోపాలపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, హెచ్‌ఐవీ నివారణకు సింహాచలం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం కళాజాత నిర్వహించారు. ఈ మహమ్మారుల్ని నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కం కణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ రెండు సామాజిక రుగ్మతుల నుంచి యువతను కాపాడాలని కోరారు. మాదక ద్రవ్యాలు, ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కళాజాత బృందం నాటకరూపంలో అవగాహన కల్పించింది. ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్‌వీఎస్ రావ్, కానిస్టేబుల్ రమేశ్ పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చుతున్న మహిళల చలివేంద్రం



మహిళలు నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రంలో బాటసారులు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్ సుసర్ల కాలనీలో ఎం.ఎం.ఆర్. (మహిళలే మహారాణులు) నిర్వహిస్తున్న చలివేంద్రం అందరి మన్ననలు పొందుతోంది. ఇక్కడి బాజీజంక్షన్, సుసర్లకాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ మహిళలంతా కలిసి సమాజ సేవ చేయాలని నిర్ణయించారు. ఏటా గిరి వెంకన్న ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం, గిరిప్రదర్శనలో పాల్గొన్న భక్తులకు టీ, కాఫీలు, ప్రతీ శని, సోమవారాల్లో బిల్వపత్ర అన్నదాన కేంద్రం నిర్వహించే కార్యక్రమంలో భోజనాలు వడ్డించటం తదితర సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రోజూ 400మందికి చల్లని మజ్జిగ, మంచినీరు అందజేస్తున్నారు.

# రూ.30 కోట్లు మురుగుపాలు!

### గెడ్డను ఆధునీకరించినా ప్రయోజనం శూన్యం



గెడ్డ నిండా మురుగు నీరు

మల్కాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): మల్కాపురంలో గెడ్డల ఆధునీకరణకు హెచ్‌పీసీఎల్ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా గతంలో వెచ్చించిన రూ.30 కోట్లు మురుగుపాలయ్యాయి. హెచ్‌పీసీఎల్ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా అచ్చినాయుడు తోట శివారు నుంచి మల్కాపురం మరిడిమాంబ గెడ్డ వరకు, అక్కడి నుంచి హెచ్‌పీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐ ఓ సీ) మీదుగా గెడ్డను నిర్మించారు. దీని లోతు చాలా వరకు ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ గెడ్డ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. దాదాపుగా 18 గ్రామాల ప్రజలు వాడే నీటితో పాటు వర్షం నీరు కూడా ఈ గెడ్డగుండానే ప్రవేశించి సముద్రంలో కలిసేలా నిర్మించారు. కానీ పనులన్నీ పూర్తయ్యాక నాడు పబ్లిక్ వర్క్స్ ఇంజనీర్ ఆశించిన ప్రకారం గెడ్డలో మురుగునీరు సముద్రంలోకి వెళ్లి కలవకుండా, అంతా ఐఓసీ గేటు వద్ద నిలువ ఉండిపోతుంది. దీంతో ఆ ప్రాంగణం అంతా మురుగుగా తయారవుతుంది. గతంలో ఈ నీటి ప్రవాహానికి ద్విచక్ర వాహనాలు నీటిలో కొట్టుకొని పోవడంతో పాటు ఐఓసీలో చమురు లోడింగ్ పనులు కూడా రెండు మూడురోజులు నిలిచిపోయేవి. ఇటీవల కురిసిన వర్షానికి ఈ గేటు వద్ద మురుగు చేరి టన్నుల కొలది ఉండిపోయింది. ప్రస్తుతం ఈ మురుగులోనే కొంగలు చేపల కోసం వేటాడుతున్నాయి. ఈ మార్గం పూర్తిగా మూసుకుపోయినట్టే. అంతకు ముందు ఈ మార్గం గుండా రాకపోకలు కూడా సాగేవి. ఇప్పుడు ఈ మార్గంలో దుర్వాసన వెదజల్లుతుంది. అనేకసార్లు జీవీఎంసీ అధికారులు వచ్చి చూసినా, పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయలేదు. మురుగు ఫొటోలు తీసుకుని వెళ్లిపోవడం తప్ప ఎటువంటి ప్రయోజనం మాత్రం ఉండడం లేదు. ఈ పరిస్థితి ఇలా కొనసాగితే భవిష్యత్‌లో ఈ మార్గం అంతా పూర్తిగా మురుగుమయమై... మార్గం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఈ మార్గంలో ఐఓసీతో పాటు హెచ్‌పీసీఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్, చింతామణి ఆలయం కూడా ఉంది. ఇవి కూడా కనిపించవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అందువలన జీవీఎంసీ ఉన్నతాధికారులు ఈ విషయంలో స్పందించి ఈ గెడ్డలో నీరు సముద్రంలో కలిసే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## శారదాపీఠంలో వజ్రణి స్కంద యాగం



యాగం నిర్వహిస్తున్న రుత్వికులు

పెందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలో గల శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వీయ పర్యవేక్షణలో ఆదివారం వజ్రణి స్కంద పాశుపత హనుమద్ యాగం మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. హనుమత్ జయంతి వరకు ఈ యాగ నిర్వహణ కొనసాగుతుందని పీఠం శ్రీకార్యం తెలిపింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ నేపథ్యంలో దేశ రక్షణ, విజయాన్ని ఆకాంక్షిస్తూ యాగ నిర్వహణ చేపట్టారు. పీఠం ప్రాంగణంలో గల యాగశాలలో రుత్వికులు శాస్త్రోక్తంగా యాగ అంకుర్పారణ చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని సంస్కారంతో యాగం ప్రారంభించారు. అనంతరం శ్రీస్కంద పాశుపత హోమం, చండీనవార్ణ మహామంత్ర హోమం, దక్షిణామూర్తి స్వరూప సాంబ సదాశివ హోమం, వీరాంజనేయ హోమాన్ని రుత్వికుల బృందం వేద మంత్రాలతో యాగార్చన చేశారు. ఈ సందర్భంగా భక్తులు దేశ సంరక్షణ, శక్తి సిద్ధికి మహావీర హనుమాన్, శక్తి మంత్రం పారాయణం పఠించారు. పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి అనుగ్రహంతో చేపట్టిన మహాయజ్ఞం భరత భూమి, ధర్మప్రతిష్ఠ శాంతికి ప్రతీక అని పీఠాధిపతి స్వరూపానందేంద్ర అన్నారు.

## ఆర్థిక లావాదేవీలతో వ్యక్తి కిడ్నాప్?

పెందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): వ్యాపార ఆర్థిక లావాదేవీల్లో ఇద్దరి మధ్య తగదా రావడంతో తన కుమారుడిని కిడ్నాప్ చేశారని పెందుర్తి పోలీసులకు ఆదివారం ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అయితే పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం తప్ప ఇందులో కిడ్నాప్ ఘటన లేదని, దీనిపై విచారణ చేస్తున్నామని సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపారు. పులగాలిపాలెం అయ్యప్పనగర్‌కు చెందిన ధనరాజ్ పాటిల్, సుజాతనగర్ వాసి కామోజీ సుధాకర్‌లు ఉమ్మడిగా వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో రూ.54 లక్షలు పెట్టుబడి పెట్టడమే కాకుండా, ఆర్థిక అవసరాల కోసం తన బంధువుల నుంచి మరో రూ.30 లక్షలు సుధాకర్‌కు ముట్టజెప్పినట్టు ధనరాజ్ పాటిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపార సంబంధిత నగదులో రూ.15 లక్షలు తన సొంత ఖాతాకు సుధాకర్ మళ్లించడంతో వివాదం జరిగిందని, ఈ సమస్య పరిష్కరించకుండా అతను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడంతో పోలీసులను ఆశ్రయించామన్నాడు. తన కుమారుడిని . ధనరాజ్ పాటిల్ మరో వ్యక్తితో కలసి కిడ్నాప్ చేశారని సుధాకర్ తల్లి రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపార పనిమీద రెండు వారాల క్రితం హైదరాబాద్ వెళ్లిన తన కుమారుడు ఇప్పటికీ ఇంటికి చేరుకోకపోవడంతో భాగస్వామి కిడ్నాప్ చేసి ఉంటారని ఆరోపించారు. అక్కడ తన కుమారుడిని నిర్బంధించారని ఆమె అన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ అప్పలనాయుడు. (ఇన్‌సెట్లో) మృతుడు బాబూరావు (ఫైల్)

గోపాలపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కిరెడ్డి బాబూరావు(52) అనే ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి స్థానిక కొత్తపాలెంలోని ఖారవేలనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఆయనకు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో మందులు కొనుగోలు చేసేందుకు ఆదివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై గోపాలపట్నం బయలుదేరి వెళ్లాడు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ డౌన్‌లో గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో బాబూరావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ విషయం ఆదివారం తెల్లవారు జామున తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాబూరావు కుమారుడు జగదీశ్వరరావు ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సీఐ జి.అప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సంఘటన స్థలానికి సమీపంలోని దుకాణాల వద్ద ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

# మందుల పంపిణీలో కోత

### యాజమాన్యం ఆదేశాలతోనే అంటున్న జింక్ రిటైర్డ్ ఉద్యోగులు

మల్కాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): మందుల పంపిణీలో యాజమాన్యం కోత విధించిందని జింక్ రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కొంతకాలంగా పూర్తిస్థాయిలో మందులు పంపిణీ చేయకుండా సగమే ఇస్తూ, యాజమాన్యం సూచన మేరకే ఇలా ఇస్తున్నట్టు ఆస్పత్రి వర్గాలు చెప్పాయని పేర్కొంటున్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వైద్య సేవలందించేందుకు జింక్‌యాజమాన్యం పలు ప్రైవేటు ఆస్పత్రులతో ఒప్పందం కుదుర్చుకుంది. మల్కాపురం ప్రాంతంలో, నగరంలోని సెయింట్ ఆన్స్ ఆస్పత్రులతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఇండస్ ఆస్పత్రిలో చేర్పించి అవసరమైన వైద్య సేవలు చేయించడానికి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రిటైర్ అయిన ఉద్యోగులు వైద్యసేవలు పొందుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వైద్యం కోసం వెళ్లిన పలువురికి చేదు అనుభవం ఎదురైంది. అవసరమైన మందులు పూర్తిగా ఇవ్వకుండా కొంతమేర మాత్రమే ఇచ్చి షాక్ ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగి, ఆయన భార్యకు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఇద్దరిలో ఎవరైనా నడవలేని స్థితిలో ఉన్నా తప్పనిసరిగా వారు వెళ్లాల్సిందే. లేకుంటే మందులు ఇవ్వడం లేదు. ఈ నిబంధనతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జింక్‌యాజమాన్యం పునరాలోచించి తమకు సక్రమంగా వైద్య సేవలు అందేలా చేడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడితో మేయర్ పీలా శ్రీనివాసరావు దంపతులు

## శాసనసభ స్పీకర్ అయ్యన్నను కలిసిన విశాఖ మేయర్ 'పీలా'

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును నగర మేయర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా నర్సీపట్నంలోని స్పీకర్ స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా స్పీకర్.. నగరాభివృద్ధికి సంబంధించి మేయర్‌కు పలు సూచనలు చేశారు. నగరవాసులకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలకు, సంక్షేమ కార్యక్రమాలకు, నగరాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వాటిని అమలు చేయాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తగిన సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మేయర్‌కు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయమవుతూ సాధారణ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, తద్వారా ప్రజాభిప్రాయాలను ఆహ్వానించి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి సూచనలు, సలహాలను అందించి మంచి పాలనకు సహకరించవలసిందిగా అయ్యన్నపాత్రుడికి పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## చిన్నారులకు దేశభక్తి అవసరం

మల్కాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు మాతృదేశం పట్ల అభిమానంతో ఉండాలని, దేశం కోసం ప్రతిఒక్కరూ ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడాలని విశ్రాంత సైనిక జవాన్ ఆర్.శేషగిరిరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరు చేయవలసిన పనిని వారు చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీతో చేయడమే దేశసేవ అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ధన, మాన, ప్రాణాలర్పించిన త్యాగధనుల గురించి సవివరంగా తెలియజేశారు. గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్ మాట్లాడుతూ సైనికుల సేవలను అందరూ గుర్తించాలన్నారు. వారు సుఖాన్ని త్యాగం చేసి సరిహద్దుల్లో కాపలా ఉండడం వల్లే మనం ధైర్యంగా సమాజంలో జీవించగలుగుతున్నామని అన్నారు. అనంతరం బాలలు దేశభక్తి గీతాలను ఆలపించారు. వారు సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివారు.



ప్రమాదాలకు కారణమవుతున్న పాత పెందుర్తిలోని స్పీడ్ బ్రేకర్లు

## ఈ స్పీడ్ బ్రేకర్లు యమడేంజర్!

పెందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): పాత పెందుర్తి రోడ్డులో ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇక్కడ పాఠశాలలు ఎక్కువగా ఉండడంతో వేగ నియంత్రణ కోసం వీటిని ఏర్పాటు చేశారు. మూడు వరుసల రహదారి మధ్యలో ఉన్న వీటిని పలువురు వాహన చోదకులు గమనించలేక అత్యంత వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. విశాఖ-అరకు మధ్య రాకపోకలు సాగించే వాహనాలకు ఇదే ప్రధాన మార్గం కావడం గమనార్హం. ఎన్‌హెచ్-16 ఫ్లైఓవర్ సమీపంలో ఉండడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్పీడ్‌బ్రేకర్లు సమాంతరంగా లేకపోవడం, రహదారి మధ్య గల ఖాళీలో వాహనాలు ప్రయాణించడంతో భారీ వాహనాలను తప్పించలేక, ఎదురుగా వస్తున్న వాటిని గమనించక అదుపుతప్పి పలువురు పడుతున్నారు. ఇక్కడి స్పీడ్ బ్రేకర్ల ఎత్తు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

## అప్పన్నకు రెండో విడత చందన సమర్పణకు ఏర్పాట్లు పూర్తి

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా రెండో విడత చందనం సమర్పణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 7 నుంచి ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది మూడు రోజుల్లో మూడు మణుగు (125 కిలో) ల సిరి చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ సారధ్యంలో ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచర్యులు ముందుగా సిద్ధం చేసిన 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాన్ని ఆదివారం మిళితం చేశారు. దీన్ని సోమవారం వేకువజామున సుప్రభాతసేవ తరువాత పండితుల మంత్రోచ్చారణలు నడుమ స్వామివారికి సమర్పించనున్నారు.



చందనంలో సుగంధ ద్రవ్యాల చూర్ణాన్ని మిళితం చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

## నిరంతర సాధనతో విజయం తథ్యం

### ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 11 (ఆంధ్రజ్యోతి) : నిరంతర సాధనతో విజయం తథ్యమని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక కాకతీయ మైదానంలో సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో, నిర్దిష్టమైన ప్రణాళికతోనే క్రీడల్లో పాల్గొనాలన్నారు. నేడు క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గాజువాకలో క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి నూకరాజు, రాజారావు, టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు గంధం వెంకటరావు, సీపీ రెడ్డి పాల్గొన్నారు.

## చురుగ్గా జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం ఆధునీకరణ పనులు

గోపాలపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో ఆధునీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మైదానాన్ని ఇక్కడి విద్యార్థులతో పాటు పరిసర ప్రాంత క్రీడాకారులు వినియోగిస్తుంటారు. ఇందులో ఓపెన్ జిమ్‌తో పాటు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా ఉంది. నిత్యం క్రీడాకారులు ఇందులో వ్యాయామం చేసేవారు. నడక కోసం వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. క్రీడా మైదానం ఎత్తుపల్లాలుగా ఉండటంతో పాటు వానొస్తే చాలు మురదమయంగా మారుతోంది. సమీపంలోనే చెరువు ఉండడంతో ఏడాదిలో చాలా రోజులు నీటి ఊటతో కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. మైదానంలో ఊట చేరకుండా రెండు అడుగుల లోతు వరకు తవ్వకాలు చేపట్టి ఇసుక, రాళ్ల పొరలుగా వేయడంతో పాటు ఇతర పనులను చేపట్టనున్నారు. మైదాన ఉపరితలాన్ని చదును చేసి క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దే పనులు చేపడుతున్నారు. రెండు నెలల్లో పనులు పూర్తయి మైదానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## రహదారి పనుల పరిశీలన

వేపగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో భరత్ నగర్ దరి లక్ష్మీనరసింహనగర్‌లో రూ.26 లక్షలతో చేపడుతున్న రహదారులు, కాలవ పనులను కార్పొరేటర్ పి.వి.నరసింహం ఆదివారం పరిశీలించారు. ఆయా వీధుల్లో చేపడుతున్న రహదారులను, వాస్తవ పరిస్థితులను చూశారు. దశలవారీగా మౌలిక వసతుల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో ఉచితశిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడి స్కిల్స్ సంయుక్తంగా పదో తరగతి, ఇంటర్ చదివిన నిరుద్యోగులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్, బ్రైడల్ ఫ్యాషన్ మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ బేవరేజస్ సర్వీస్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7337076665, 7207953920 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

# నిర్లక్ష్యపు పునాదులపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

» ప్రమాదాలకు చిరునామా కప్పరాడ జంక్షన్
» పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


కప్పరాడ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పునాది దిమ్మలు


గుంపుగా జాతీయ రహదారి దాటుతున్న పాదచారులు

కంచరపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం జాతీయ రహదారి కప్పరాడ జంక్షన్ ప్రమాదాలకు చిరునామాగా మారింది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎంతో మంది కాళ్లు, చేతులు విరిగి శాశ్వత వికలాంగులుగా నిలిచిన దుర్ఘటనలు ఉన్నాయి. కొండవలస గ్రామపరిధి కప్పరాడ,రాజీ ఎస్టేట్, స్నేహర్ కాలనీ, బాపూజీ నగర్, పెదకొత్తూరు, ఇందిరానగర్ తదితర ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారిని దాటి కంచరపాలెం మెట్టు వద్దకు రావాలంటే కప్పరాడ జంక్షన్ వద్ద సవాల్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. జాతీయ రహదారి కావడం, వాహనాలు అతివేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ఇక్కడ రోడ్డు దాటే సమయంలో పాదచారులు ప్రమాదాలకు గురవుతుంటారు. స్థానికులు, పాదచారుల ఇబ్బందులను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు రెండు దశాబ్దాల క్రితం చొరవ చూపారు. నిధులు మంజూరు చేయించి రోడ్డుకు ఇరువైపులా పునాదులు కూడా తవ్వి భారీ దిమ్మలు ఏర్పాటు చేశారు. ఫుట్ బ్రిడ్జిని పటిష్ఠంగా నిర్మించడానికి పనులు ముందుకు సాగుతున్నాయనుకున్న సమయంలో ఎమ్మెల్యే పదవీ కాలం ముగిసిపోవడంతో పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. అనంతరం ముగ్గురు ఎమ్మెల్యేలు మారినా ఈ పని పూర్తి తిని ఎవరూ పట్టించుకోలేదు. కప్పరాడ జంక్షన్ వద్ద పాదచారులు రోడ్డును దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ ప్లాంట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం ప్రభుత్వాలు మారడంతో నిర్మాణం కోసం వేసిన పునాదులు నిరుపయోగంగా ఉండిపోయాయి. నాటి నుంచి బాటసారులు ప్రమాదాలబారిన పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. సుమారు రూ.50 లక్షలతో పునాదుల దిట్టంగా వేసి నిర్లక్ష్యంగా వదిలేయడమేమిటని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదాల నివారణకు తక్షణమే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.

## భక్తులకు మెరుగైన సేవలు: ఈవో సుజాత


బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం నూతన ఈవో సుజాత

సింహాచలం, మే 11 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సేవలందిస్తామని ఆలయ నూతన ఈవో, దేవాదాయ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత అన్నారు. ఆదివారం ఉదయం ఆమె సింహాచలం దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టారు. తొలుత స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈవర జిల్లో వార్షిక బిల్లింగ్ ఓవర్ బుక్‌లో తొలి సంతకం చేశారు. సాయంత్రం వరకు కొండదిగువ తన కార్యాలయంలో పలు ఫైళ్లు పరిశీలిస్తూ బిజీగా గడిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు దేవస్థానం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న గొంప చంద్రమౌళి

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అసోసియేషన్‌లోని 395 మంది సభ్యుల్లో 310 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం. సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దాల రమేశ్, ఉపాధ్యక్షులుగా గుర్రం సింహాచలం, బర్ల రమానాయుడు, ట్రెజరర్‌గా సిరికి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్‌గా మధు పాడ రవికుమార్, జాయింట్ కార్యదర్శులుగా బూటు కృష్ణ, కె. అప్పలనాయుడు. సభ్యులుగా కోటేశ్వరరావు, కంచర్ల శ్రీను, కె. రామలింగేశ్వరరావు, అల్లు సూర్యనారాయణ, అల్లు బంగారునాయుడు, నేమాల రమేశ్, బిట్ర గణపతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ కాంట్రాక్టర్లు కేజీ రామారావు, ఏఆర్ అప్పలరాజు, పి.సుబ్బారావు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని తాజా మాజీ సంఘం అధ్యక్షుడు గొంప చంద్రమౌళి అభినందించారు.

### గురకతో అనారోగ్య సమస్యలు

మహారాణిపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): గురకతో అనేక అనారోగ్య సమస్యలకు ఆస్కారం ఉందని, నిర్లక్ష్యం చేయరాదని ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ కిషోర్ అన్నారు. గురక రావడానికి కారణాలు, జరిగే అనర్థాలపై ఈఎన్‌టీ వైద్య నిపుణులతో ఆదివారం విశాఖలోని అంకోసా సమావేశ మందిరంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. గురకతో పక్షవాతం, మధుమేహం, గుండె జబ్బులు, పక్షవాతం, ఒత్తిడి, ఎదుగు దల, జ్ఞాపకశక్తి తగ్గటం, తదితర అనారోగ్యాలకి గురికావడం జరుగుతుందన్నారు. డాక్టర్ సిమదుసూదనరావు, డాక్టర్ వైదీ అనన్వరీ, సుమారు 400 మంది వైద్యులు హాజరయ్యారు.

### నగరంలో వాహనాల తనిఖీ

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు పోలీసులు ఆది వారం రాత్రి ముఖ్యమైన కూడళ్లలో నాకాబందీ, వాహనాల తనిఖీ నిర్వహించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జిలతో పాటు 32 ముఖ్యమైన కూడళ్లలో సాయంత్రం ఆరు నుంచి ఈ తనిఖీలు చేపట్టారు. 1212 వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు లేని తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు, అలాగే హెల్మెట్ ధరించని 50 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇద్దరిపై, నంబర్ ప్లేట్ సరిగా లేని ఏనిమిది మందిపై కేసులు నమోదు చేశారు.

### మాధవధారలో వేసవి క్రీడా శిబిరం


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కోచ్, బాలలు, అతిథులు

మాధవధార, మే 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఉచిత క్రీడా శిక్షణలో భాగంగా ఆదివారం మాధవధార ఈస్ట్ పార్కులో కరాటే శిబిరాన్ని ప్రారంభించారు. కోచ్ డి.ఎల్లారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ మురళీకృష్ణ, వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల శ్రీధర్ హాజరయ్యారు. నెల రోజులు కొనసాగే శిబిరంలో కరాటే, కిక్ బాక్సింగ్, స్కేటింగ్‌తో అంశాల్లో బాలలకు తర్ఫీదు ఇవ్వనున్నట్టు తెలిపారు. బాలలకు ఉదయం శిక్షణతో పాటు, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తామన్నారు. బాలలు క్రీడాసాధనలో ఈ ఉచిత శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్-11 బాలుర, బాలికల ఓపెన్ చెస్ టోర్నీ కమ్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. గాజువాక లయన్స్ క్లబ్‌లో జరిగిన ఈ ఎంపిక టోర్నీలో బాలుర, బాలికల విభాగాల నుంచి 137 మంది చిన్నారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. బాలుర విభాగంలో అవసరాల సౌరజేష్, శశాంక కుంచ...బాలికల విభాగంలో అన్విక మహా్వ్, కమల ప్రియ బట్ల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. తొలి రెండు స్థానాల్లో విజేతలు త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మాణిక్యంరావు తెలిపారు.

## రైల్వేస్టేషన్లలో విస్తృత టికెట్ తనిఖీలు.. జరిమానాలు


రైల్వే స్టేషన్‌లో టికెట్ తనిఖీ చేస్తున్న సీనియర్ డీసీఎం సందీప్

విశాఖపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, దువ్వాడ, విజయనగరం, పీపురుపల్లి స్టేషన్లలో సీనియర్ డీసీఎం కె.సందీప్ తన సిబ్బందితో విస్తృతంగా పర్యటించి టికెట్ తనిఖీలు చేశారు. డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆదేశాల మేరకు ప్రధానంగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయాల నిర్వహణ, అమృత భారత్ స్టేషన్ పనుల పురోగతిని పరిశీలిస్తూ టికెట్ బుకింగ్ కార్యాలయంతోపాటు సమగ్ర టికెట్ తనిఖీలు చేపట్టారు. అలాగే సౌకర్యాల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ చేపట్టడంతోపాటు ప్రయాణికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి కేవలం విశాఖ, దువ్వాడ, విజయనగరం, పీపురుపల్లి స్టేషన్లలోనే కాకుండా ప్రశాంతి, మెయిల్, అమరావతి, పాట్నా-ఎర్నాకులం, తంబరం-న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్ తనిఖీలు చేశారు. ఈ డ్రైవ్‌లో 182 మంది టికెట్ లేని ప్రయాణికులతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వారిని పట్టుకుని వారి నుంచి రూ.1,27,375 జరిమానా వసూలు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు భద్రతతో కూడిన సురక్షిత ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా డ్రైవ్ నిర్వహించామన్నారు.

## సత్తివాడ శ్రీకాంత్‌కు సాహితీరత్న జాతీయ పురస్కారం


రచయిత శ్రీకాంత్‌కు సాహితీరత్న జాతీయ పురస్కారం ప్రదానోత్సవం చేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్‌కు సాహితీరత్న జాతీయ పురస్కారం లభించింది. ఆదివారం ఏలూరులో మహ లక్ష్మీగోపాలస్వామి కళ్యాణమండపంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, శ్రీనాథ మహాకవి వారసులు, కవి డా.శ్రీనివాసశర్మ తదితరుల నుంచి ఈ పురస్కారాన్ని పొందారు. కవిగా, రచయితగా సత్తివాడ శ్రీకాంత్ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. ప్రశంసాపత్రం, జ్ఞాపిక, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నరసింహ జయంతి

సీతమ్మధార, మే 11 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల శ్రీకృష్ణ మందిరం వద్ద గల వేద రక్షణ హాలులో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నరసింహ జయంతి వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు నిష్కించన భక్తదాస ప్రవచనాలు వినిపించారు. భక్తులకు నరసింహ స్వామి అవతారం ప్రాముఖ్యతను వివరించారు. హరే నామ సంకీర్తనలతో నరసింహ స్వామివారికి మంగళహారతి పూజా కార్యక్రమాలు జరిపారు.

#### కంఠ గురుదత్త సాయి మందిరం వార్షిక మహోత్సవాలు

సీతంపేట మధురానగర్‌లోని కంఠ గురుదత్త సాయి మందిరం 19వ వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు చేసి వెండి ఆభరణాలతో అలంకరించారు. శైవాగమ పండితులతో అగ్ని ప్రతిష్ఠాపన, శాంతి హోమం, పూర్ణాహుతి పూజలు జరిపారు. లలితాదేవి, మహాశివలింగ అర్చన పూజలను ఆలయ అర్చకులు ఆయిలూరి శ్రీనివాస దీక్షితులు నిర్వహించారు.

## భారత్ విజయం కాంక్షిస్తూ పూజలు


దొండపర్తి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

అక్కయ్యపాలెం/దొండపర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో భారత్ విజయాన్ని కాంక్షిస్తూ దేశం కోసం, సైనికుల కోసం గ్రేటర్ 42వ వార్డు జగన్నాథపురంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం టీడీపీ, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురుగోవింద్ సింగ్, ప్రకాశ్‌రెడ్డి, శ్రీకృష్ణ, వేణు, రాజగిరి కృష్ణ, రత్నం తదితరులు పాల్గొన్నారు. గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలోని సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి దేవాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పూజలు చేశారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి మాట్లాడుతూ కల్లుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి శనివారం రాత్రి డ్రోన్లను ఇండియా వైపు పంపి పాకిస్తాన్ మళ్లీ కవ్వింపు చర్యలకు ఉపక్రమించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఏఎస్ ప్రకాశ్‌రెడ్డి, ఆల్లూరి సత్యనారాయణరెడ్డి, గుండు సురేష్‌బాబు, అంగటికుమార్ రాజా, గురుగోవింద్ సింగ్, వి.లక్ష్మీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వద్ద పోలీసు అవుట్ పోస్టుకు వినతి


టీడీపీ నాయకుడు సీతారాజు సుధాకర్‌తో మాట్లాడుతున్న స్థానికులు

మహారాణిపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం రైల్వేస్టేషన్ బయట అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయని, పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి సీతారాజు సుధాకర్ ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానికులు వినతి పత్రాన్ని అందించారు. ఆకతాయిలు, మందుబాబుల బెడద అధికంగా ఉందని మద్యం, మత్తుపదార్థాలు సేవించి అసాంఘిక కార్యకలాపాలు సాగించటం ఇటీవల ఎక్కువైందన్నారు. ఈ ప్రాంతంలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## ‘పార్టీలకతీతంగా బీసీల సమస్యలపై పోరాటం’


బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న కట్టా మల్లేశ్వరరావు

పీతంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): బీసీలను అందరినీ కలుపుకొని పార్టీలకతీతంగా బీసీల సమస్యలపై పోరాటం చేస్తూ అన్ని కుల సంఘాలను, అన్ని ప్రజాసంఘాలను, అన్ని పార్టీల్లో ఉన్న బీసీ నాయకులను కలుపుకొని సమగ్ర కులగణన సాధించుకునేందుకు పోరాటం చేసిన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంగర పూర్ణచంద్రరావు తెలిపారు. పౌరగ్రంథాలయంలో బీసీ సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్ణచంద్రరావు మాట్లాడారు. రాజ్యాధికారమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలకు అధ్యక్ష, కార్యదర్శులను నియమించుకున్నారు. బీసీ సమన్వయకమిటీ జిల్లా అధ్యక్షుడిగా కట్టా మల్లేశ్వరరావుకి నియామక పత్రం అందజేశారు. నాయకులు దూడు రెడ్డి బాబు, శ్రీరాములు, పోట్లూరి దేవి, అల్లు రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు సీఐల కౌన్సెలింగ్

సీతంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐలు రమణ, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏసీపీ ఆర్.ఎస్. ధర్మేంద్ర, చిన్నంనాయుడు వారికి పలు సూచనలు చేశారు. సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వాములైతే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## ఆర్టీసీకి సమ్మర్ కిక్

... 5వ పేజీ తరువాయి

పెరిగిన కారణంగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. మొత్తం 814 బస్సుల్లో 5.44 లక్షల మంది ప్రయాణించినప్పుడు సగటు ఆక్యుపెన్సీ రేషియో 57 శాతంగా ఉంది. ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి ఇవే బస్సుల్లో 6.8 లక్షల మంది ప్రయాణించడంతో సగటు ఆక్యుపెన్సీ రేషియో 67 శాతానికి పెరిగింది. ప్రస్తుతం ఇదే ఒరవడి కొనసాగుతున్నది. రోజువారీ ఆదాయం కూడా అదే స్థాయిలో పెరిగింది. మార్చి నెలాఖరు వరకు సగటున రోజువారీ ఆదాయం రూ.88 లక్షలు ఉండ. అయితే ఏప్రిల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సగటున రోజువారీ ఆదాయం రూ.99 లక్షలు వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## ‘కార్మికుల హక్కులను కాలరాసేలా లేబర్‌కోడ్‌లు’


ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

డాబాగార్డెన్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాల రాసే విధంగా కేంద్ర ప్రభుత్వ లేబర్‌కోడ్‌లు ఉన్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె సదస్సులో ఆయన మాట్లాడారు. ముందుగా సమ్మె ప్రచార పోస్టర్‌ను, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌లకు పిలుపునిచ్చాయని, అన్నివర్గాల కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కావాలని అనేక వర్గాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ వి.సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, నాయకులు వై.కొండయ్య, బి.గౌరీ, కనకరెడ్డి, పీఓడబ్ల్యు నాయకులు బాలనాగమ్మ, అరుణోదయ ఏడుకొండలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భూముల అప్పగింతకు ఎందుకంత అత్యుత్సాహం!

... 5వ పేజీ తరువాయి

బహిర్గతం చేస్తే అక్రమార్కులైన అధికారులు ఎవరో తేలిపోతుంది. తద్వారా వారిపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వభూమి నిర్వహణలో పక్కాగా ఉంటారని రెవెన్యూ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

ఇదిలావుండగా విశాఖ రూరల్ మండలం ఎండాడలో సర్వే నంబర్ 14-1లో 5.10 ఎకరాల భూమి మాజీ సైనికోద్యోగికి కట్టబెట్టడంలో గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఇద్దరు నేతలు కూటమి ప్రభుత్వంలోనూ పైరవీలు చేశారని ఆరోపణలున్నాయి. వీరిలో ఒకరు ప్రస్తుతం కూటమి పార్టీలో కొనసాగుతుండడంతో తనకున్న పలుకుబడితో పైరవీలు చేశారని విమర్శలున్నాయి. పార్టీ మారినా గతంలో ఉన్న పరిచయాలను కొనసాగించి భూముల దారాదత్తంలో కీలక పాత్ర వహించడంపై కూటమి పార్టీలో కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## అసలేం జరుగుతోంది..

... 5వ పేజీ తరువాయి

ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరడం లేదు. కొన్ని కేసుల్లో మాత్రం భారీగా ఆదాయం వచ్చే ఉద్యోగం, పని చూపిస్తామంటూ అమాయకులైన మహిళలను మభ్యపెట్టి కొందరు తీసుకువెళ్లి ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్న పరిస్థితి కనిపిస్తుండడం శోచనీయం. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నాలుగు నెలల్లో మహిళల అదృశ్యానికి సంబంధించి 175 ఫిర్యాదులు అందగా, వీటిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగిలిన 42 మంది ఆచూకీ మాత్రం ఇంతవరకు లభ్యం కాకపోవడంతో వారంతా ఏమైపోయారనే దానిపై వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జనవరి నెలలో 37 మంది, ఫిబ్రవరిలో 49 మంది, మార్చిలో 43 మంది, ఏప్రిల్‌లో 46 మంది మహిళలు కనిపించడం లేదంటూ వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుల్లో పోలీసులకు ఫిర్యాదులు అందిన వాటిలో 42 మందిని ఒకరోజు వ్యవధిలోనే ఎక్కడ ఉన్నారో గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం పోలీసులు మిస్సింగ్ కేసుల దర్యాప్తులో చూపుతున్న శ్రద్ధకు అద్దంపడుతోందని చెప్పవచ్చు. మరో ఏనిమిది కేసులను మాత్రం కేసు నమోదు చేయడానికి ముందే పోలీసులు వారి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళలకు ఆహుయిత్యాలు, హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో అదృశ్యమై ఇప్పటికీ ఆచూకీ దొరకని మహిళల పరిస్థితి నెలకొనడంతో అసలేం జరుగుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వారు ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొనడం కుటుంబ సభ్యులు మానసిక వేదనకు గురవుతున్నారు. మహిళలు, యువతుల మిస్సింగ్ కేసులపై పోలీసులు మరింత శ్రద్ధ చూపిస్తే బాధిత కుటుంబాలకు స్వాంతన కలిగించేందుకు అవకాశం కలుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏషియన్ పవర్ లిఫ్టింగ్ టోర్నీలో ఆంధ్ర లిఫ్టర్లకు పతకాలు



స్వర్ణ పతకాలు సాధించిన లిఫ్టర్లతో కోచ్ కోటేశ్వరరావు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్ర మహిళా లిఫ్టర్ల స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్టుల్లో ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. డెహ్రాడూన్‌లో ఆదివారం జరిగిన ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ ఈవెంట్ మహిళల 47 కిలోల విభాగంలో ఎం.షానూస్ స్వర్ణ పతకం, 84 ప్లస్ విభాగంలో నగమ్ జ్ఞాన దివ్య స్వర్ణ పతకం, 84 కిలోల విభాగంలో షేక్ మహీనా సర్వపతకం సొంతం చేసుకున్నారు. ఐక ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ టోర్నీలో 47 కిలోల విభాగంలో మదిరా షనూస్ కాంస్య పతకం, 84 ప్లస్ కిలోల విభాగంలో నగమ్ జ్ఞానదివ్య రజత పతకం, 84 కిలోల విభాగంలో షేక్ మహీనా స్వర్ణ పతకం, 57 కిలోల విభాగంలో ఎస్.కె.నదియా ఓవరాల్ నాల్గో స్థానంలో నిలిచింది. ఆంధ్ర మహిళా లిఫ్టర్లు పతకాలు సాధించడంపై భారత్ పవర్ లిఫ్టింగ్ కోచ్, ఇంటర్నేషనల్ రిఫరీ సకల కోటేశ్వరరావు అభినందించారు.

# ఆర్కే బీచ్‌కు సందర్శకుల తాకిడి

## ఎండల నుంచి ఉపశమనానికి తీరానికి పోటెత్తిన జనం

బీచ్ రోడ్డు, మే 11, (ఆంధ్రజ్యోతి) : ఆర్‌కే బీచ్ ఆదివారం సందర్శకులతో నిండిపోయింది. ఎటు చూసినా సందడే సందడి. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో బీచ్ ప్రాంతాలు కోలాహలంగా మారాయి. ఇక్కడ ఖాళీ స్థలాల్లో పిల్లలు సరదాగా గడిపారు. ఈ ప్రాంతమంతా సందర్శకులతో నిండిపోయింది. తీరంలో ఆటపాటలతో గడిపారు. ఎక్కువ మంది సముద్రంలో స్నానాలు చేశారు. సాగరంలో ఉన్న రాళ్లపై ఆడుతూ సందడి చేశారు.

నగర ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో సందర్శకులు ఎక్కువగా వచ్చారు. వేసవి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి బీచ్‌లో గడపడం ఉత్తమమని భావిస్తున్నట్టు పలువురు తెలిపారు. బీచ్‌కు సందర్శకులు అధికంగా రావడంతో ఈ ప్రాంతంలో స్థానిక ప్రైవేటు హోటళ్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. బీచ్‌లో సందర్శకుల తాకిడి అధికంగా ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.


సముద్రంలో స్నానాల సందడి..


జనంతో సందడిగా ఉన్న తీరం


సముద్రంలోని బండలపై 'ఆట'విడుపు

# ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు కలిసి రావాలి

- భారత్‌కు బాసటగా ప్రపంచ దేశాలు నిలుస్తున్నాయి
- ఐకమత్యమే భారతీయుల బలం
- డీఎస్ఎన్ఎల్ఎన్ వర్సిటీ వీసీ సూర్యప్రకాశ్‌రావు



కార్యక్రమంలో పాల్గొన్న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య డి.సూర్యప్రకాష్‌రావు, ఏయూ ప్రొఫెసర్లు, విద్యార్థులు

వెంకోజీపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడం ద్వారా ప్రపంచశాంతి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి.సూర్యప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఏయూ విద్యా విభాగంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం-దేశ సమైక్యతను పెంపొందిద్దాం- మేరా భారత్ మహాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద నిర్మూలనలో భాగంగా భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి సంఘీభావం లభిస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా ప్రపంచ దేశాలన్నీ సమష్టిగా కలిసి పని చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అభివృద్ధికి అవరోధంగా తీవ్రవాదం నిలుస్తోందన్నారు. ప్రజలందరి ఐక్యత మన దేశానికి వెలకట్టలేని సంపదగా నిలుస్తోందన్నారు. ఐక్యమత్యమే భారతీయుల బలమని ప్రపంచం గుర్తించిందన్నారు. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి విచారకరమని, ఈ దాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ భారతదేశ సాంకేతిక పటిమను, రక్షణ రంగంలో మన శక్తిసామర్థ్యాల సత్తాను చాటిందన్నారు. ప్రజలంతా దేశ భద్రతకు, అభివృద్ధికి పటిష్ఠతను పాటుపడాలని సూచించారు.

ఏయూ విద్యా విభాగాధిపతి టి.షారోన్‌రాజు మాట్లాడుతూ భారతదేశం ఎల్లప్పుడు శాంతిని కోరుకుంటుందని, అదే సమయంలో తమ దేశ ప్రజలకు ముప్పు తలపెట్టేవారిని ఎంత మాత్రం ఉపేక్షించదన్నారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా ఆపరేషన్ సిందూర్ నిలుస్తుందని పేర్కొన్నారురు. పాక్‌తో యుద్ధంలో మృతి చెందిన తెలుగు జవాను మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం త్రివర్ణ పతకాలను పట్టుకుని 'భారత్ మాతాకీ జై.. మేరా భారత్ మహాన్...' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే తనయుడు ప్రతాప రుద్ర జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో కేక్ కట్ చేస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర

వెంకోజీపాలెం, మే 11(ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు, టీడీపీ యువ నాయకులు వెలగపూడి ప్రతాప్‌రుద్ర జన్మదినోత్సవ వేడుకలను 15, 16 వార్డుల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 15వ వార్డులోని హెచ్‌బీకాలనీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రతాప్‌రుద్ర కేక్ కట్టింగ్ చేసి, మహిళలకు చీరలు అందజేశారు. అలాగే 16వ వార్డులోని దుర్గాదేవి ఆలయం వద్ద మెకానిక్ నారాయణ ఆధ్వర్యంలో ప్రతాప్‌రుద్ర కేక్ కట్టింగ్ చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

**పెదవాల్తేర్‌లో..**

పెదవాల్తేరు (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరు ఓల్డ్ త్రీ టౌన్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బిస్కెట్స్, చాక్లెట్స్, డ్రింక్స్ పంపిణీ చేశారు. అనంతరం చినవాల్తేరులోని మహమ్మదీయ మసీద్ యూత్ అధ్వర్యంలో వెలగపూడి ప్రతాప్ రుద్ర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీద్‌లో గౌసేపాక్ నిషానీ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేసి, మదర్సా విద్యార్థులకు చాక్లెట్స్, బిస్కెట్స్, పుస్తకాలు, పెన్‌లు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.

**ఎమ్మెల్యే కార్యాలయంలో..**

ఎంవీపీ కాలనీ (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం శాశనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర జన్మదిన వేడుకలను ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. తెదేపా నాయకుడు పీతల అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలె వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, టీడీపీ నాయకులు ధనరెడ్డి, అభిషేక్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## పితాపురంకాలనీ పార్కులో ఆక్రమణలు ఆపాలి

మద్దిలపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : పితాపురం కాలనీ పార్కును ఆక్రమించాలనుకునే జీవీఎంసీ ప్రయత్నాలను ఆపాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వీఏఆర్‌డబ్ల్యుఏ) జోన్-3 అధ్యక్షుడు జేపీ శర్మ, కార్యదర్శి జీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పితాపురం కాలనీ లేఅవుట్ వేసినప్పుడు నివాసుల వినోద కార్యకలపాల కోసం ఓపెన్ స్పేస్‌కేటాయించి కాలనీ అసోసియేషన్ నిర్వహణ కోసం అప్పగించారని తెలిపారు.

1990లో పార్కులో కొంత భాగంలో జీవీఎంసీ కమర్షియల్ భవనం నిర్మించిందని, ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో మరికొంత భాగం ఆక్రమించుకుని భవనం విస్తరించడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. పార్కు ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణ పనులు వెంటనే ఆపి, 1990కి ముందు ఉన్నట్టుగా స్థలం మొత్తం పితాపురం కాలనీ అసోసియేషన్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు.

## ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- కంచె ఏర్పాటుపై పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు


దీన్‌దయాళ్‌పురంలో కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆరిలోవ, మే 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దీనదయాళ్‌పురంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్స్‌కు ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. రోడ్డు పక్కన ఓ సిమెంటు దిమ్మె కట్టి దానిపై ఏర్పాటు చేసి ఉన్నారు. అది కూడా తక్కువ ఎత్తులోనే ఉంది. ఇక ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రాంతంలో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఉన్నాయి. కంచె లేకపోవడంతోఇది ప్రమాదకరంగా ఉంది. పొరపాటున పశువులు, మనుషులు అటు వైపు వెళితే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంది. రోజు వందలాది మంది వాకర్స్ ఆ మార్గంలో వెళుతుంటారు. అలాగే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆ దారిలో నుంచే వెళుతుంటారు.

ఈ సమస్యపై ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత ఎలాంటి చర్యలైనా తీసుకోవడం కాకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం తగదని మండిపడుతున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవడం అవసరమని అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## శాకాంబరీదేవిగా పోలమాంబ అమ్మవారు


శాకాంబరీ దేవిగా పూజలు అందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలో శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శాఖంబరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కాయగూరలతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. వేడుకల్లో సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వహక కార్యదర్శి చెల్లి బోయినసునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరిప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు పాల్గొన్నారు.

## ఏషియన్ పవర్ లిఫ్టింగ్ టోర్నీలో ఆంధ్ర లిఫ్టర్లకు పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్ర మహిళా లిఫ్టర్లు స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్టులో ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. డెహ్రాడూన్‌లో ఆదివారం జరిగిన ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ ఈవెంట్ మహిళల 47 కిలోల విభాగంలో ఎం.షానూన్ స్వర్ణ పతకం, 84 ప్లస్ విభాగంలో నగమ్ జ్ఞాన దివ్య స్వర్ణ పతకం, 84 కిలోల విభాగంలో షేక్ షబీనా స్వర్ణపతకం సొంతం చేసుకున్నారు. ఇక ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ టోర్నీలో 47 కిలోల విభాగంలో మదిరా షనూన్ కాంస్య పతకం, 84 ప్లస్ కిలోల విభాగంలో నగమ్ జ్ఞానదివ్య రజత పతకం, 84 కిలోల విభాగంలో షేక్ షబీనా స్వర్ణ పతకం, 57 కిలోల విభాగంలో ఎస్.కె.సదియా అల్మాస్ ఓవరాల్ నాల్గో స్థానంలో నిలిచింది. ఆంధ్ర మహిళా లిఫ్టర్లు పతకాలు సాధించడంపై భారత్ పవర్ లిఫ్టింగ్ కోచ్, ఇంటర్నేషనల్ రిఫరీ సకల కోటేశ్వర రావు అభినందించారు.

## ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ అధ్యక్షుడిగా జేకే నాయక్



సిరిపురం, మే 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని ఒడియా కమ్యూనిటీకి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రధాన సామాజిక - సాంస్కృతిక సంస్థ ఉత్కల్ సమాజం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని సిరిపురంలోని సమాజ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా జేకే నాయక్, ఉపాధ్యక్షులుగా సోమనాథ్ సాహు, డాక్టర్ కరుణాకర్‌పాధి, కార్యదర్శిగా బిమల్‌కుమార్ మహంత, సాంస్కృతిక కార్యదర్శి సీమా మొహంతి, కోశాధికారిగా మహేశ్వర్ బెహరా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జేకే నాయక్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వివిధ సాంస్కృతిక, సాహిత్య, సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ఒడియా సంస్కృతి, వారసత్వం, సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తానన్నారు.

**'లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం'**

ఉక్కుటౌన్‌షిప్, మే 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామని ఇంటక్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి అన్నారు. ప్లాంట్ యూనియన్‌కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ లేకుండా పోయిందని, కార్మికహక్కుల సాధన కోసం, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ఈ నెల 20న తలపెట్టనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొనాలనికోరారు.

### సినిమా గైడ్

- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 26, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 90, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 26, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)**

| | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

## శాసనసభ స్పీకర్ అయ్యన్నను కలిసిన నగర మేయర్ 'పీలా'


స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన విశాఖ మేయర్ పీలాశ్రీనివాసరావు దంపతులు

వెంకోజీపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా నర్సీపట్నంలోని స్పీకర్ స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ విశాఖ నగరాభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలపై విలువైన సూచనలను మేయర్‌కు సూచించారు. విశాఖ నగర ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలకు, సంక్షేమ కార్యక్రమాలకు, నగరాభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అమలు చేయాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తగిన సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మేయర్‌కు ఆయన తెలిపారు. అదే విధంగా ప్రజా ప్రతినిధులు అధికారులు మధ్య సమన్వయంతో సాధారణ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, వాటిలో ప్రజా అభిప్రాయాలను ఆహ్వానించి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని, ఈ సమావేశాలు నగర పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా చేయాలని మేయర్‌కు స్పీకర్ సూచించారు. ఈ సందర్భంగా విశాఖనగరాభివృద్ధికి సూచనలు, సలహాలు అందించి మంచి పాలనతోపాటు విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని స్పీకర్‌ను మేయర్ కోరారు.

## ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

- రూ.9 లక్షల వసూలు చేసి పరారైన వ్యక్తిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం వేయిస్తానని, నేవీ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పిస్తానంటూ సుమారు రూ.తొమ్మిది లక్షలు తీసుకొని మోసగించిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ నాలుగో సెక్టరులో నివాసం ఉంటున్న దుక్కా లక్ష్మికి తన ఇంటి కింద పోర్షన్‌లోని అమ్మ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న గౌతమ్ కృష్ణ తనను పరిచయం చేసుకుని, లక్ష్మిని సోదరిగా భావిస్తున్నానని చెప్పేవాడు. తాను నేవీలో పని చేస్తున్నానని, తమ ఆంటీ జీవీఎంసీలో పని చేస్తూ పదవీ విరమణ చేయబోతోందని, ఆ ఉద్యోగం లక్ష్మికి వేయిస్తానని నమ్మబలికాడు. అలాగే లక్ష్మి కుమారుడికి నేవీ పాఠశాలలో చేర్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకోసం పలుదఫాలుగా రూ.9 లక్షలు వసూలు చేశాడు. మరోసారి ఐ ఫోన్ కావాలంటూ లక్ష్మి పేరిట ఈఎంఐలు పెట్టాడు. తర్వాత పత్తాలేకుండా పోయాడు. తనను మోసం చేసిన గౌతమ్ కృష్ణపై లక్ష్మి ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు మోసం కేసు నమోదు చేశారు.

## 'కోన'ను కలిసిన యాదవ సంఘ ప్రతినిధులు


కోన తాతారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

వెంకోజీపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన కోన తాతారావును విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యాదవుల హక్కులు గుర్తింపునకు ఈ నియామకం ఎంతో గౌరవం కలిగించిందని, కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయంతో సమతుల్యతకు పాటుపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గొంపా గోవిందు, గుంటుబోయిన రవికుమార్; నర్సింగ్‌రావ, నక్కా కనకరాజు, పల్లా మహేస్, కోడిబోయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీర సైనికుడు మురళీ నాయక్‌కు ఘన నివాళి


మురళీ నాయక్‌కు నివాళులు అర్పిస్తున్న వైసీపీ నేతలు

మద్దిలపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్‌కు మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆదివారం పలువురు వైసీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి, దేశ ప్రజలకు రక్షిస్తున్నారన్నారు. అలాంటి సైనికులకు దేశ ప్రజలందరు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతపల్లి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ సతీష్, నాయకులు రవిరెడ్డి, మొల్లి అప్పారావు, బాణాల శ్రీనివాసరావు, అనిల్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అండ్ పబ్‌పై కేసు నమోదు

- అర్ధరాత్రి దాటినా తెరచి ఉండడంతో పోలీసుల చర్యలు

మద్దిలపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : సిరిపురం వాల్తేరు మెయిన్ రోడ్డులో నిర్వహిస్తున్న కాస్మిక్ హౌస్ రెస్టో బార్ అండ్ పబ్ నిర్వహకులపైనా ఆదివారం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బి.పైడయ్య తెలిపిన వివరాలివి. కాస్మిక్ హౌస్ రెస్టోబార్ అండ్ పబ్‌కు ఉదయం 11 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహించడానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులున్నాయి. అయితే శనివారం రాత్రి 1.30 గంటల సమయంలో కూడా తెరిచి మద్యం, ఫుడ్ విక్రయాలు చేశారు. ఈ విషయమై వచ్చిన సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు పబ్‌పై తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి దాటిన పబ్ మూయకుండా నిర్వహించి లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించడంతో చట్టపరమైన చర్యలు తీసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ పైడయ్య మాట్లాడుతూ మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, పబ్‌లు తమ లైసెన్స్ నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. నిబంధనల అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నిరుద్యోగులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడి స్కిల్స్ సంయుక్తంగా పదో తరగతి, ఇంటర్ చదివిన నిరుద్యోగులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్స్ సంస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్, బ్రైడల్ ఫ్యాషన్ మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ బేవరేజస్ సర్వీస్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ప్రైవేటు రంగ సంస్థల్లోఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు.వివరాలకు ఫోన్ :7337076665, 7207953920లోసంప్రదించాలన్నారు.

## 'ఎమ్మెల్యే పల్లా జన్మదిన వేడుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి'


మాట్లాడుతున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, శ్రమించే కార్యకర్తలను గుర్తించే మంచి లక్షణం టీడీపీలోనే ఉందని ఆ పార్టీ 86 వార్డుఅధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 86వ వార్డులోని మాతృశ్రీ నగర్‌లో ఆదివారం ఇటీవల ఎంపికైన వార్డు కమిటీ ప్రతినిధుల సమావేశాన్ని వాళ్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ వార్డు టీడీపీకి కంచుకోట అని, కార్యకర్త లు పార్టీ అభ్యున్నతికి సైనికుల్లా పని చేయాలన్నారు. సోమవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు వార్డు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాసరావు, కార్యదర్శి జగదీష్, బూత్ కమిటీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# నిరంతర సాధనతో విజయం తథ్యం

**» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**


మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 11 (ఆంధ్రజ్యోతి) : నిరంతర సాధనతో విజయం తథ్యమని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక కాకతీయ మైదానంలో సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో, నిర్దిష్టమైన ప్రణాళికతోనే క్రీడల్లో పాల్గొనాలన్నారు. నేడు క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గాజువాకలో క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి నూకరాజు, రాజారావు, గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్‌లు గంధం శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు గంధం వెంకటరావు, సీపీ రెడ్డి పాల్గొన్నారు.

## సత్యసాయి మందిరంలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఉక్కుటౌన్‌షిప్, మే 11 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా మందిరంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వ్యక్తిత్వ వికాసం, పెద్దలపై భక్తి భావం, చిత్రలేఖనం, పెయింటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ముగింపు సందర్భంగా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ కాలం చాలా విలువైందని, సమయాన్ని వృథా చేయకుండా భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

# అసలేం జరుగుతోంది..

... 5వ పేజీ తరువాయి

ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరడం లేదు. కొన్ని కేసుల్లో మాత్రం భారీగా ఆదాయం వచ్చే ఉద్యోగం, పని చూపిస్తామంటూ అమాయకులైన మహిళలను మభ్యపెట్టి కొందరు తీసుకువెళ్లి ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్న పరిస్థితి కనిపిస్తుండడం శోచనీయం. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నాలుగు నెలల్లో మహిళల అదృశ్యానికి సంబంధించి 175 ఫిర్యాదులు అందగా, వీటిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగిలిన 42 మంది ఆచూకీ మాత్రం ఇంతవరకు లభ్యం కాకపోవడంతో వారంతా ఏమైపోయారనే దానిపై వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జనవరి నెలలో 37 మంది , ఫిబ్రవరిలో 49 మంది, మార్చిలో 43 మంది, ఏప్రిల్‌లో 46 మంది మహిళలు కనిపించడం లేదంటూ వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుల్లో పోలీసులకు ఫిర్యాదులు అందిన వాటిలో 42 మందిని ఒకరోజు వ్యవధిలోనే ఎక్కడ ఉన్నారో గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం పోలీసులు మిస్సింగ్ కేసుల దర్యాప్తులో చూపుతున్న శ్రద్ధకు అద్దంపడుతోందనే చెప్పవచ్చు. మరో ఎనిమిది కేసులను మాత్రం కేసు నమోదు చేయడానికి ముందే పోలీసులు వారి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో అదృశ్యమై ఇప్పటికీ ఆచూకీ దొరకని మహిళల పరిస్థితి నెలకొనడంతో అసలేం జరుగుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వారు ఎక్కడైనా జీవించి ఉన్నారా? లేక మృతి చెందారా? అని కుటుంబ సభ్యులు మానసిక వేదనకు గురవుతున్నారు. మహిళలు, యువతుల మిస్సింగ్ కేసులపై పోలీసులు మరింత శ్రద్ధ చూపిస్తే బాధిత కుటుంబాలకు స్వాంతన కలిగించేందుకు అవకాశం కలుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## భూముల అప్పగింతకు ఎందుకంత అత్యుత్సాహం!

... 5వ పేజీ తరువాయి

బహిర్గతం చేస్తే అక్రమార్కులైన అధికారుల ఎవరో వెల్లడవుతుంది. తద్వారా వారిపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో పక్కాగా ఉంటారని రెవెన్యూ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

ఇదిలావుండగా విశాఖ రూరల్ మండలం ఎండాడలో సర్వే నంబర్ 14-1లో 5.10 ఎకరాల భూమి మాజీ సైనికాధికారికి కట్టబెట్టడంలో గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఇద్దరు నేతలు కూటమి ప్రభుత్వంలోనూ పైరవీలు చేశారనే ఆరోపణలున్నాయి. వీరిలో ఒకరు ప్రస్తుతం కూటమి పార్టీలో కొనసాగుతుండడంతో తనకున్న పరిచయాలతో పైరవీలు చేశారనే విమర్శలున్నాయి. పార్టీ మారినా గతంలో ఉన్న పరిచయాలను కొనసాగించి భూముల ధారాదత్తంలో కీలక పాత్ర వహించడంపై కూటమి పార్టీలో కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం : ఇంటక్

ఉక్కుటౌన్‌షిప్, మే 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామని ఇంటక్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి అన్నారు. ప్లాంట్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ లేకుండా పోయిందని, కార్మిక హక్కుల సాధన కోసం, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ఈ నెల 20న తలపెట్టనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, ఎస్‌పి నాయుడు, దేముడు, అప్పారావు, రెడ్డి, సాహరా పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడి స్కిల్స్ సంయుక్తంగా పదో తరగతి, ఇంటర్ చదివిన నిరుద్యోగులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు బొల్లినేని మెడి స్కిల్స్ సంస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్, బ్రైడల్ ఫ్యాషన్ మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ బేవరేజస్ సర్వీస్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ : 73370 76665, 72079 53920లో సంప్రదించాలని కోరారు.

## సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 26, బంగాళ దుంపలు 20, అరటి కాయ (పె)9, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 90, బద్దచిక్కుడు 48, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45,పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 26, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

## కార్పొరేటర్‌కు 'రౌతు'ను కలిసిన టీడీపీ కమిటీ


కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ను కలిసిన కమిటీ సభ్యులు

అగనంపూడి, మే 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు టీడీపీ నూతనంగా నియామకమైన కమిటీ సభ్యులు ఆదివారం స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను సత్కరించారు. వార్డులో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, కార్యదర్శి పప్పల మూర్తి, మాడిశ వెంకటరావు, కరణం పైడిరాజు, సురేశ్, నాగేశ్ పాల్గొన్నారు.

## నేడు బుద్ధపూర్ణిమ మహాసభ

పెదగంట్యాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 76వ వార్డు బర్మాకాలనీలో సోమవారం బుద్ధపూర్ణిమ మహాసభ నిర్వహించనున్నారు. బుద్ధ జయంతి సందర్భంగా విశాఖ జిల్లా బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం ఈ మహాసభను నిర్వహిస్తున్నది. మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

## వీర జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళులు

అగనంపూడి. మే 11 (ఆంధ్రజోతి) : పాక్ కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు స్థానిక సీడబ్ల్యూసీ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రతినిధులు మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్ భారతజాతి గర్వించదగిన సైనికుడన్నారు. పాకిస్థాన్ దాడిని ఎదురొడ్డి నిలిచిన మురళీనాయక్ సేవలు మరవలేనివని కొనియాడారు.

# ఆర్టీసీకి సమ్మర్ కిక్

... 5వ పేజీ తరువాయి

పెరిగిన కారణంగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. మొత్తం 814 బస్సులో 5.44 లక్షల మంది ప్రయాణించినప్పుడు సగటు ఆక్యుపెన్సీ రేషియో 57 శాతంగా ఉంది. ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి ఇవే బస్సుల్లో 6.8 లక్షల మంది ప్రయాణించడంతో సగటు ఆక్యుపెన్సీ రేషియో 67 శాతానికి పెరిగింది. ప్రస్తుతం ఇదే ఓఆర్ కొనసాగుతున్నది. రోజువారీ ఆదాయం కూడా అదే స్థాయిలో పెరిగింది. మార్చి నెలాఖరు వరకు సగటున రోజువారీ ఆదాయం రూ.88 లక్షలు ఉంది. అయితే ఏప్రిల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సగటున రోజువారీ ఆదాయం రూ.99 లక్షలు వస్తుందని అధికారులు పేర్కొన్నారు.







































జన్మదిన
శుభాకాంక్షలు
మృదుస్వభావి, సౌమ్యుడు, నిగర్వి, నిరాడంబరులు
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు
గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు
గౌ॥ శ్రీ పల్లా శ్రీనివాసరావు గార్కి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
కళ్ళేపల్లి అశోక్ వర్మ
అక్షయ ట్రావెల్స్, కూర్మన్నపాలెం
ఇందుకూరి శిరీష్ కుమార్ రాజు (సిరి)
శ్రీ ఉషోదయ లాజిస్టిక్స్
ఇందుకూరి సత్య ప్రసాద్ రాజు
P.A.R. TRANSPORT
అయినంపూడి వెంకట రమణరాజు
(వాసు)
శ్రీ లక్ష్మీనరసింహ ట్రాన్స్‌పోర్ట్
కళ్ళేపల్లి శ్రీనివాసవర్మ
విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ సెక్రటరీ
Ex. AMC Director, Visakhapatnam
గాజువాక నియోజకవర్గం క్షత్రియ సంఘం

## ఘనంగా మాతృ దినోత్సవం

అగనంపూడి, మే 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి మహాత్మ గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. నేటి యువత.. తల్లి గొప్పతనం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.































